## క్లుప్తంగా

### నేడు పెర్నపాడులో ఎంపీ పర్యటన

**వేముల :** మండలంలోని పెర్నపాడు గ్రామానికి శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కోటి రూపాయలతో నిర్మించిన గోడౌన్, రూ.3 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, మినరల్ వాటర్ ప్లాంటు, పంచాయతీ కార్యాలయాన్ని, యూజీడీ పనులను ప్రారంభిస్తారన్నారు. అనంతరం శ్రీసీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

### వలంటీర్లకు సన్మాన సభ

**జమ్మలమడుగు :** మున్సిపాలిటీ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### నేడు శ్రీరాముని పాదుకలకు పూజలు

**వీరపునాయునిపల్లి :** యరమలపల్లెలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ హిందూ మహాసభ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాముని పాదుకలకు పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 28 హోమగుండములు, 108 దంపతులతో మహాగణపతి, శ్రీ లక్ష్మి నారాయణ, మహా సరస్వతి, శ్రీ లలితారుద్ర, గాయత్రి సుదర్శన, మృత్యుంజయ హోమములు నిర్వహించనున్నారు. లోక కల్యాణ విశ్వశాంతి ధర్మ సంస్థాపనార్థం నిర్వహించే ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### పాఠశాలకు పోర్టబుల్ అంప్లిఫయర్ వితరణ



పాఠశాలకు పోర్టబుల్ అంప్లిఫయర్‌ను అందిస్తున్న కల్లూరు గంగాధర్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మెయిన్ స్కూల్‌కు శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవ సంస్థ కార్యదర్శి కల్లూరు గంగాధర్‌రెడ్డి అందించిన పోర్టబుల్ అంప్లిఫయర్‌ను మండల విద్యాధికారి శివప్రసాద్ చేతుల మీదుగా పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి దాత కల్లూరు గంగాధర్‌రెడ్డి, ఆయన భార్య కల్లూరు మల్లేశ్వరీలను ఘనంగా సత్కరించారు. 4వ వార్డు కౌన్సిలర్ కల్లూరు సునీత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రూ.11.81 లక్షలకు దినసరి మార్కెట్ వేలం పాట

**ఎర్రగుంట్ల :** మున్సిపల్ పరిధిలోని దినసరి మార్కెట్ రేటు వేలం పాటను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించామని మున్సిపల్ ఆర్ఓ గంగిరెడ్డి తెలిపారు. ఈ వేలం పాటలో ఇద్దరు పాల్గొనగా వీరిలో ఎస్.సుమన్‌కుమార్‌రెడ్డి రూ.11.81 లక్షలకు వేలం పాడి మార్కెట్ రేటు వేలం పాటను దక్కించుకున్నారన్నారు. మున్సిపల్ శాఖ సూచించిన మేరకు దినసరి మార్కెట్ రేటు వసూళ్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఎర్రగుంట్ల :** పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నందు శనివారం ఉదయం 9 గంటల నంచి మధ్యాహ్నం 1 గంటకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి .కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్ల నందు గల చెట్టు కొమ్మలు తొలగించు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట వేడుకలు



పెర్నపాడులో ఆలయం

**వేముల :** మండలంలోని పెర్నపాడులో శుక్రవారం నుంచి శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పురోహితులు గడియారపు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పూజాది కార్యక్రమాలతో ప్రారంభించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది. తొలిరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

# ప్రజల వద్దకే పాలనను అందించడమే సీఎం ధ్యేయం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

**చింతకొమ్మదిన్నె :** ప్రజల వద్దకే పాలనను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలుములపల్లి, తాడిగొట్ల, కొప్పర్తి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో చేసి చూపిస్తున్నాడన్నారు. పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ప్రజలకు అందాల్సిన అవసరాలు ఏమైతే ఉన్నాయో వాటిని తీర్చేందుకు ప్రతి గడప తట్టుతున్నారన్నారు. మళ్లీ సువర్ణ పరిపాలన రావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామపంచాయతీలలో ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే సచివాలయం ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అలాగే మండలంలోని మూలంక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మసీదును శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కష్టయ్య, ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగరాజు, సర్పంచులు సుబ్బరాయుడు, కోకటం లక్ష్మీనారాయణరెడ్డి, వర్ధిరెడ్డి సురేంద్రారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, నాయకులు నాగమల్లారెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అందరికీ సంక్షేమ పథకాలు..**

**జమ్మలమడుగు :** నవరత్నాల పథకాల ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం భీమారాయుని కొట్టాల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వారికి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించి ఎప్పుడు ఏమి జరుగుతుందో అంటూ ప్రజలు భయపడేవిధంగా పాలన సాగించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చిన్నపాటి గొడవలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయాడు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి ప్రజలకు తాము ఏమి చేశామో చెప్పి ఓట్లను అడుగుతున్నాడన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రజలను ఈ విధంగా ఓట్లు అడిగిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్న నేస్తంతోపాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### ముగిసిన శ్రీకృష్ణదేవరాయ జయంతి వేడుకలు

**సింహాద్రిపురం :** స్థానిక బుడ్డయ్యపాలెం ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు తుపాకుల రాఘవేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణదేవరాయ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలుగు భాష ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఉపాధ్యక్షుడు ఇండ్ల రామకృష్ణ, బలిజ సంఘీయులు పాల్గొన్నారు.

## సిద్ధం సభను జయప్రదం చేయండి



సిద్ధం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల టౌన్ :** ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సిద్ధం బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వచ్చి జయప్రదం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో ఆయన సిద్ధం బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నాయకత్వంలో సిద్ధం సభకు తరలి వెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వాణిజ్య విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగుల వీరాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్లు కోడి రమణ, చంద్రమౌళి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**తొండూరులో..**

**తొండూరు :** ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం తొండూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాప్తాడులో జరిగే సీఎం సిద్ధం బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

## ప్రారంభమైన శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు



వేంకటరమణుడి గ్రామోత్సవంలో భక్తాదులు

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని పాత బస్టాండు నందు వెలసిన శ్రీపద్మావతి సమేత కల్యాణ శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. రథసప్తమిని పురస్కరించుకుని భక్తులు దేవదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉభయదారులతో ప్రత్యేక పూజలు జరిపించారు. ముందుగా రథసప్తమి సందర్భంగా స్వామి వారిని సూర్యభగవానుడి ఆలంకారంలో పట్టణ పూలంగళ్ల సర్కిల్ వద్ద సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ప్రత్యేక వాహనంలో కొలువుతీర్చి సూర్య ప్రతిబింబాలు పడేవరకు అక్కడే పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం సేనాధిపతి ఉత్సవంతోపాటు అంకుర్పారణ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

## సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం



సూర్య నమస్కారాలు చేస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

**వేంపల్లె :** నిత్యం సూర్య నమస్కారాలు, యోగా, వ్యాయామం చేయడంవలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శుక్రవారం స్థానిక ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో రథ సప్తమి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య నియమాలపై అవగాహన పెంచుకోవాలని.. అలాగే మన ఆరోగ్యం వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం వల్ల చేతుల్లోనే ఉందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఉపకరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులచే యోగా, సూర్య నమస్కారాలు, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ఓఎస్డీ గంగిరెడ్డి, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, డీన్ సీహెచ్ రత్నకుమారి, ఎఫ్ఓ కోటేశ్వరి, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ ఇమ్రాన్ షరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

**వేంపల్లె :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి. బాదుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, సీపీఐ కార్యదర్శి వెంకట్రాములు, సహాయ కార్యదర్శి బ్రహ్మంలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయొద్దని, కేంద్ర సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని.. ఆ విధానానికి స్వస్తి పలకాలన్నారు. అలాగే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు చల్లా బాలాజీ, కోశాధికారి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి

**పులివెందుల రూరల్ :** వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైన నడపాలంటే తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ కార్యాలయంలో 35వ జాతీయ భద్రత మహోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి బీమా కలిగి ఉంటే ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు వాహనాలతోపాటు ప్రమాద బారినపడిన బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీలు నష్టపరిహారాన్ని అందిస్తాయన్నారు. ప్రతి వాహనదారుడు తమ వాహనాలకు బీమా సౌకర్యాన్ని చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మట్కా బీటర్లు అరెస్ట్

**కడప అర్బన్:** కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెన్నూరు బస్టాండ్ వద్ద బ్రాహ్మణ వీధిలోకి వెళ్లే దారిలో ముగ్గురు మట్కా రాస్తుండగా శుక్రవారం సాయంత్రం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వీరిలో షేక్ మౌలాలీ, షేక్ మహమ్మద్ అఫ్రోజ్ ఆలీ, షేక్ అమీర్ జాన్‌లు వున్నారు. వీరి వద్ద నుంచి రూ. 55,270 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



వేంపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందిస్తున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి, తదితరులు



వేములలో వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ నాగరాజు



లింగాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమాదేవి, తదితరులు

**వేంపల్లె :** ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల వద్దకే మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఎన్.లక్ష్మీ గాయత్రి, ఎంపీడీఓ దివిజా సంపతిలు తెలిపారు. శుక్రవారం స్థానిక రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఒకటవ సచివాలయంలో వారు ప్రారంభించారు. అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా ఆధునిక వైద్య సహాయం అందిస్తున్నామని.. అలాగే అవసరమైన వారికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి ప్రభుత్వ ఖర్చులతో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వాతిసాయి, స్పెషలిస్ట్ వైద్యులు సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వేములలో..**

**వేముల :** గ్రామీణ ప్రాంతాలలో ప్రజల వద్దకే జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు అందుతున్నాయని డీఎంహెచ్ఓ నాగరాజు తెలిపారు. మండలంలోని చాగలేరు గ్రామంలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి నిరుపేదకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ కేంద్ర పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరంలో నలుగురు వైద్యులచే కంటి పరీక్షలతోపాటు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందించి మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత వాసులు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవ రెడ్డి, వైద్యాధికారి శరణ్య, సర్పంచ్‌లు అర్జున్, చెన్నారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**లింగాలలో..**

**లింగాల :** జగనన్న ప్రజల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని.. ఇంటి ముందుకే వైద్య సేవలు అందుతున్నాయని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రమాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని కామసముద్రం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కామసముద్రం, రామాపురం, ఇంటి ఓబాయపల్లె, కమ్మవారిపల్లె ప్రజలు వైద్య సేవలు పొందారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఎక్కడ వ్యాధులు నయం కానీ వారిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి, ఎంపీడీఓ తేజోజ్యోష్ణ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ లోకేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, వలంటీర్లు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీవృషభాచలేశ్వర స్వామి ఊరేగింపు

**వేంపల్లె :** స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దులకొండలపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ ఈఓ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో స్వామివారిని గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరినాథ శర్మ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెసనల్స్ ఆసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన అనంత్ డైమండ్స్ వారి సౌజన్యంతో, ఆవోపా రాష్ట్ర మహిళా విభాగపు అధ్యక్షురాలు ఆరవేటి నిర్మల సహకారంతో ప్రచురించిన సకల దేవతల నిత్య పూజా విధానం అను పూజ గ్రంథాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆవోపా మహిళా విభాగపు అధ్యక్షురాలు పి.ప్రవీణ, మహిళా విభాగపు అధ్యక్షురాలు బి.నాగలక్ష్మి, ఆవోపా, ఆవోపా మహిళా విభాగాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంటీసీ డాక్టర్ యల్లకుమార్

**పులివెందుల రూరల్ :** పులివెందుల ప్రాంతంలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ఎంటీసీ డాక్టర్ యల్లకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉన్న క్షయవ్యాధికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా పులివెందులలో టీబీ యూనిట్‌లో ముక్త్ పంచాయతీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే బిదినంచర్ల, కోవరంగుంటపల్లె పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం పీహెచ్‌సీ కేంద్రాల్లోని రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ్లా నాయక్, టీబీహెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ కొండారెడ్డి

**చక్రాయపేట :** మండలంలోని కుప్పం గ్రామం చిన్నమోరయ్యగారిపల్లెలో తెలుగుదేశం పార్టీకి చెందిన సుమారు 25 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వీరికి మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చిన్నమోరయ్యగారిపల్లెకు చెందిన రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మహేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, గంగిరెడ్డి, హేమానందరెడ్డి, గంగిరెడ్డి, పుల్లారెడ్డి, హేమలత, గంగిరెడ్డి, లక్ష్మీదేవి, వెంకటలక్షుమ్మ, నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నరసింహారెడ్డి, ఓబుళరెడ్డి, దశరథరామిరెడ్డి, ఉత్తమారెడ్డి, శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డితోపాటు మరిన్ని కుటుంబాల వారు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమయ్యామన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు కార్యకర్తలకు అండగా నిలబడుతుండటంతో తాము తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్‌సీపీలో చేరినట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, సర్పంచ్ గంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు నౌషాద్, పార్టీ నేతలు మోహన్‌రెడ్డి, దేవానందరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, మునిరెడ్డి , చెన్నకష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు



లోమడ గ్రామంలో నూతన ఆలయ సముదాయం

**సింహాద్రిపురం :** మండలంలోని లోమడ గ్రామంలో శనివారం నుంచి మూడు రోజులపాటు శ్రీగణపతి, సీతారామ, లక్ష్మణ, హనుమ, శ్రీలక్ష్మీచెన్నకేశవ, కృష్ణభగవాన్, నాగ, శ్రీపార్వతిసమేత శ్రీసిద్ధలింగేశ్వర, కుమారస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట వేడుకలు నిర్వహించనున్నామని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం మహాగణపతి పూజ, యాగశాల ప్రవేశం, యంత్రాభిషేకం, తదితర పూజాది కార్యక్రమాలు, సాయంత్రం అంకురార్పణ, జాలాదివాసం, నైవేద్యం తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. 18వ తేదీన ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజ, మూలమంత్ర జపాలు, దీక్షా హోమాలు, మహాస్నపనం, ధ్యానాది వాసం తదితర పూజాది కార్యక్రమాలతోపాటు సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 19వ తేదీన సోమవారం ఉదయం విగ్రహ ప్రతిష్ట, ప్రతిష్టా హోమాలు, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, శ్రీసీతారాముల, శివపార్వతుల కల్యాణ మహోత్సవం, వేద ఆశీర్వాదం, మంత్ర పుష్పం తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

**19న బండలాగుడు పోటీలు :**

ఈనెల 19వ తేదీన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సీనియర్ క్యాటగిరి కోడెలచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతి కింద రూ.80వేలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రెండవ బహుమతి కింద రూ.60వేలు మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మూడవ బహుమతి కింద రూ.50వేలు కసనూరుకు చెందిన హరినాథరెడ్డి, 4వ రూ.40వేలు, 5వ రూ.30వేలు, 6వ రూ.20వేలు, 7వ రూ.15వేలు, 9వ రూ.10వేలు, 10వ బహుమతి కింద రూ.8వేలు ఇవ్వనున్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండు డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. ఆర్టీసీ డిపోకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే 9959225780 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీ పద్మావతి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం
తాటిరెడ్డిపల్లె(గ్రా), లింగాల(మం), కడప జిల్లా
e-Procurement Tender
NIT NO.P/COE/206/2024. Dt:06.02.2024
దేవాలయ అభివృద్ధి పనుల కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ ను చూడగలరు.
ఇట్లు... ధర్మకర్త